అభినవసరస్వతి

[మాసపత్రిక]

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహు[illegible]యగు
జానపాటి పట్టాభిరామశాస్త్రి[illegible]
ప్రచురింపబడుచున్నది.

గుంటూరు.

సంపుటము	1937 సం॥	సంచిక
29	అక్టోబరు నెల	7

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు	రు 25 0 0	సహాయులకు	రు 5 0 0
పోషకులకు	10 0 0	చందాదారులకు	రు 3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Guntur by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

రాజపోషకులు.

శ్రీమంతు, రాణి ఆదిలక్ష్మీదేవమ్మ బహాదరుగారు,
గద్వాలసంస్థానము.

ప్రధానపోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు సచ్చిదానందాభినవశంకర భారతీస్వాములవారు, హంపి.

౨ శ్రీ శ్రీ జగద్గురు, అభినవోద్దండ విద్యానృసింహభారతీ స్వాములవారు, పుష్పగిరి

3 ఇనిగెల వెంకటధర్మారెడ్డి సద్దేశముఖుగారు - ఆత్మకూరు.

౪ తంగెడ నరసింహారావుగారు, కరణము, మొర్జంపాడు.

౫ ఆర్. రామారెడ్డిగారు, దైవముదిన్నె.

౬ రాజా సురభి వెంకటరత్నాంబ బహాదరుగారు, రాణి, ఆఫ్ జటప్రోలు, కొల్లాపురము.

౭ శ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామివారు, యాదగిరి.

౮ రాజా రఘునందనసింగుగారు, నెల్లుట్ల.

౯ రాజా విక్రమదేవవర్మగారు - జయపురసంస్థానప్రభువులు.

పోషకులు.

౧ జాగర్లమూడి కుప్పుస్వామినాయుడుగారు, కారంచేడు.

౨ లింగాల రంగారెడ్డి దేశముఖుగారు, గణపురము.

3 రాజా కందుకూరు బాలసూర్యప్రసాదరావు బహద్దరు జమీందారుగారు - దేవిడి

౪ రాణి వెంకట లక్ష్మి వెంకయాంబరావుగారు - మీర్జాపురము, ఎస్టేటు.

౫ రాయప్రోలు రాఘవదీక్షితులుగారు, పోలీసుసర్కిలిన్‌స్పెక్టరు, నందిగామ

౬ తాండ్ర వెంకటకృష్ణారెడ్డి దేశముఖుగారు, బసవాపురము.

గొడ్డుతనమునకు సంతానవంతు లందఱును గారణమా? కులుచబొత్తి పెరుఁగఁజాలని తరుగుల్మలతలకుఁ గోమలముగఁ బెరుఁగుచున్నవియే కారణ మగునా? సోమరి తన మలకలచుకొనిన బాలుని యధమపద్ధతికిఁ దెలివిగల బాలకులు నుపాధ్యాయులుఁ గారకులని పల్కుదురా? వారభివృద్ధిమార్గ మీసోమరివలెనే వదలిన వీఁడే యగ్ర గణ్యుఁడుగదాయని వివరింతురా? ప్రతిప్రాణి పతనదశకును జీవించియున్న ప్రాణి సంఘమే కారణము కాఁగలదందురా? ప్రపంచములో లక్షోపలక్షలు పాడుకట్టు విషయమున నీసంకరవర్ణ పతితస్థితికిఁ బైవారు హేతువులనెడి మీవాదమున కేమి యాధారము?

విచారింప నాలాగుననే వీరను గలియుచు వచ్చిన నిట్లు తొలఁగియుండుట తప్పెడిదేమో? అది వీరు చేయలేదు. చేయరు. మీరు చేయింపలేరు. దేవుఁడిట్లు విధించిన ట్లేర్పడినవాఁడు మనకర్తవ్యము లేదు. మీ రిట్టికార్యములు సంఘబలమున నదిమి సాధింపఁబూనుట పశుబలములోఁ బశుబలము. నిరర్థకము. బంగారము పంకిల మగుటకుఁ జొక్కపుబంగారము కారణమగునా? దానివెంట నిదియు సంకరము కాఁజాలక వెలయుటగూడ నపచారమా? వివేచనమనునది కొంచె ముపయోగించిన ఋజువగు విషయమున నింత యనాలోచనముగ వర్ణమతసంకర మర్థించువారికి సా ధారణమైన సహాయమా? ఇదేమి గొప్ప శాస్త్రమా? వీరేమి చెప్పినను వినఁగూడదను గాఢాసూయతో మావనవి విననొల్లరో? వినినను జవాబీయరో? ఇచ్చినను నా కోడికి మూడేకాళ్ళనియెదరో? సంఘబలముఁ బ్రభుత్వబలము నున్నదికదాయని తృణీకరింతురో? దేవునిమీఁద భారముంచి నిరీక్షించెదను. హిందూపవిత్రస్థానము లైన దేవాలయములలో హరిజనులని మీ రుపపాదించువారిని బ్రవేశపెట్టుట కిదే ఘంటానాదమును మీ రొనర్చుచున్నారు. ఏమీ యుద్దేశములోని సారాంశము? మీరు పవిత్రస్థానములని మీ వేదములతో నిరూపించి భావించు కాంగ్రెసు సంఘాల సంఘస్థానములలోఁ బ్రతిష్ఠాపనాచార్యత్వము మీకే కలదుగదా! మీ దయవల్లన నీట్లు ప్రసాదింపవచ్చునే? ప్రసాదించుచున్నారే? సాగనే. తీర్థప్రసాదము లా సంగి వారివలన గ్రహించుచునే యున్నారు. ఈకార్యమునకు మీ రిచ్ఛావశవర్తులు. మీపద్ధతులలో నిచ్ఛ కగ్రస్థానము. మాపద్ధతులలో శ్రుతిస్మృతిసంప్రదాయా విరుద్ధసంస్కారమైన చిత్తమున కగ్రస్థానము. వేదప్రతిష్ఠాపనాచార్యులచే వేదోక్త పూర్వకముగ సేవింపఁబడు దేవతాస్థానములలో విరుద్ధముగఁ దద్వేదబాహ్యుల బలవంతముగఁ బశుమార్గబలముతోఁ బ్రవేశింపఁజేయుటకు న్యాయమార్గమున మీ కేమి స్వాతంత్ర్యము? మీరు న్యాయవాదులే? ఇదికోల? లేక మైనారిటీవారు తమ హక్కు లక్రమముగ నస్వాధీనములైనవనియు సనాతనులు ప్రతిపక్షమువారు గాన రక్షింపఁడనియు వకాల్తునామా యొసఁగిరా? ఇంతటి యసంస్కారుల గుంపుకట్టి యెదిరింపఁజాలని నిరపరాధిసనాతనమతముల నణఁగఁద్రొక్కుట హింస, దౌర్జన్యము. కాక మఱేమి? విప్లవకారులని మీకు నామకరణ మొనర్చుటలో నపచార మేమున్నది? ఈచేష్టలు పాలకుల మ్రోలఁ జూపినపుడు వారు ప్రతి

స్తుతి చేయుచున్నారు. సనాతనులో దైవప్రార్థనము చేయుచు నహింసా శాంతుల నాచరణయందుఁ బెట్టి సంస్థలకు మేలుబంతిగ దిద్దఁబెట్టుచున్నారు. భిక్షువులై సంకరు లగుచున్నారు. శాసనబద్ధులై శిక్ష కరుగుచున్నారు. పైన మితిలేని స్వాతంత్ర్యముల మఱియు స్వేచ్ఛనే యర్థించుచున్నారు. స్వాతంత్ర్య మవసరమైనను గట్టుబాట్లను సమూలముగఁ దెగించుచున్న సంకరముతో మూఢాభ్రాంతిపూర్వకప్రీతి పాటింపవలసినవారై యున్నారు. కట్టుబాట్లంత కొఱమాలినవై యుండవనోపు. దీని కట్టుబాట్లుపదేశించు కారణమున వేదము లున్మాదదములు. పురాణము లరాళములు. ధర్మశాస్త్రములు శస్త్రములు. పూర్వాచార మనరాని విచారము. పూర్వులు నిర్వీర్యులు. ప్రాచీనుల యాచితి చితి. బ్రాహ్మణులు జిహ్మలు. క్షత్రియు లపాయులు. వైశ్యు లప్రాశ్యులు. శూద్రులు క్షుద్రులు. ఇఁకఁ దెగిన పటములవలెఁ గట్టుబాట్లు విడిచి మినుకుమినుకులాడు సంస్కారప్రియులు వారినిమిత్తమై సంస్కారము లేరి నుద్ధరించు భూభర్తలు మూర్తీభవించిరి. దీని కేశాస్త్రము నక్కఱలేదు. శాస్త్రోదాహరణమునకే రంకు. సంస్కారభిక్షువున కెక్కడఁ బూజ? ఆవువులలోని దెబ్బలు వహింగి నున్నగఁ జెక్కి కరచరణాదు లెంతచక్కగ నొనరించిన నంతటి గొప్పపూజ. అట్లుగాకున్న వంటకట్టెయగును నుపయోగింపవు. తగినసమిధలుగ నైన సంస్కరించిన నేకదా పనికివచ్చును? లేకున్న నేమి పనికివచ్చును? కట్టుబాటులోనుండి గుఱ్ఱముకదను చాతుర్యగాలక్ మొదలగు చిత్రగతుల నడుగు జెప్పక నడచిననే దానికిఁ బూజ. గాడిదవలె స్వేచ్ఛగ నడచుచున్నది యుత్తమాశ్వమైనను దాని నెవఁ డంగీకరించును? చదివినవానికే యుద్యోగము. అందును నమిత చక్కగ నున్నదని తోఁచిన యదృష్టశాలికే. ఏదియు నెఱుఁగని మొఱకేమి చేయుచున్నాఁడు? ఇట్టిస్థితిలోఁ బ్రత్యసంస్కారియు స్వాతంత్ర్యప్రియుండా? వారి స్వాతంత్ర్యప్రతిపాదనకు మీవంటి మహాశయులు ఫీజు మాఫీగా వాదించి ప్రతిపాదింపఁజేయఁ బట్టానందిన లాయరులా? ప్రతిసామాన్యసంస్కారణికిని స్త్రీస్వాతంత్ర్యమని స్వేచ్ఛాచరణ మిప్పించు విశ్వమానవస్వాతంత్ర్యప్రియవాదులమను న్యాయవాదులా? లేక పబ్లిక్ ప్రాసిక్యూటరులా? ప్రజాప్రాతినిధ్యమని రాజకీయములు నెదిరింపఁబట్టా? సంకరధర్మోద్ధరణమని సనాతనధర్మముల నెదిరింపఁబట్టా? రాజకీయప్రతిఘటనమునఁ బ్రజాప్రాతినిధ్యమునకు మీకోరిన వరములిచ్చినను మీప్రార్థనలు వినకున్నను జైళ్ళు లక్షోపలక్షల సంఘవ్యక్తి బలవత్ప్రతిఘుప్రతిఘటనమగుటవలనఁ బ్రాణాపాయములఁ బ్రతిఫలము లగుచున్నవి. కేవలము పశుబలము వారి దెబ్బవదో వారికిఁ బ్రతిబింబము మీవియు నగుచున్నది. ఇఁక శాంతి యాధ్యాత్మికము నహింస యెక్కడ? సంకరోద్ధరణమునకై సనాతనుల వెంటఁ బడిన వారును వారి ధర్మములును వాని ననువదించు శ్రుతిస్మృతులును భగవంతునికి మొక్కుచు మీరనుచున్న శాంతి యాధ్యాత్మికము నహింస నవలంబించుచున్నారు. మీ పతితసంకర మనుష్ఠింప నొల్లకున్నను మీ రనుక్షణము ననుమున్న శాంత్యహింసల ననుసరించుచున్నారు గనుక సనాతనులుగూడ మీకృపకు

సమీపమున నున్నారని తలఁపవచ్చును. మీ కార్యక్రమ మీ సనాతనులలోఁగూడఁ గొనసాగుట బూటకమేయై భగవద్గుప్తధర్మమే నిలుచుచున్నది. కాని సనాతనుల శాంతిమూలమున మీవిప్లవజనసంఘ సంకరపుఁదీర్మానముల కుదాసీనతయే కాని సుఫలము ప్రత్యక్షము కాఁజాలదు. అందుకే మీకు వీరన్న నంత యనాలోచన. పోని. దేవాలయములలోనికే మీరు దూఱి వారిని దూర్పవలెననునది భక్తితోనా? దౌర్జన్యముతోనా? భక్తియే యందుఁ గా? పాపములను దొలఁగించు స్థానములు దేవాలయములని యేవేదము లుపన్యసించుచున్నవో యేవేదములు పూజాపురస్కారము లొనగూర్చుచున్నవో యా వేదములు మీరు దూఱు రస్తాన మీ కనుజ్ఞ యిచ్చుటలేదు. మఱియొకరస్తా నన్వేషించిన నందఱకు వందనీయముగ నగుపట్టవచ్చును. ఆవేదము ననుజ్ఞ నొసంగనపుడు వేదోక్తస్థలముల వేదవిరుద్ధపద్ధతితో నపవిత్రమొనర్చుచున్నామని యెఱిఁగియు విజ్ఞానమార్గ మరయక యందే ప్రవేశింపఁ బశుబల ముపయోగపెట్టుట భక్తియా? మహిమ మచ్చట లేదనుకొనిన నీప్రయాణప్రయప్రయాసలేల? భక్తివిరుద్ధముగ నేగిన దైవదూరుల మగుదుమని మీ రేలజంకరు? ఈప్రశ్నలు మీలో మీరు వేసికొని జవాబు లరయుఁడు. దీపమున్న గృహమును జూడవలెనని దీపవిరోధి వాయువు రివ్వునఁ దూఱిన నాదీప మాఱి యాయింటఁ జీఁకటి యేర్పడునా? లేక దీపావలోకనమే యగునా? ఆది దీప మార్చి చీఁకటి గలిగించుట గుర్తెఱిఁగియు నచ్చటి కేలపోవలయు! సామాన్యపరిణామవాది (సైన్సువేత్త) మహాభూతకార్యక్రమ మేమియు నెఱుఁగక సంస్కరింపఁదలఁచుటఁ జూడ సూర్యచంద్రబింబములు వ్రాలినవనియు వంగినవనియు శ్రావణమున నదిమి సుత్తెన మొత్తఁజూచినట్లున్నది. బహిష్కరణమన నేమియర్థము? మీచదువులలో మీకీశబ్దమున నంతలోప మగుపట్టుచున్నదా? దీనియర్థమును మీరెఱింగినచో మీకాంగ్రెసుతత్త్వము యొక్క జీవసూత్రమే (తాళిబొట్టే) అది మాటకుముం దేకోర్క ప్రసాదింపకున్నను మీ రవలంబించు సంఘశక్తి కేది యుత్తేజకమయి మెఱుఁగిడుచున్నది? ఉడుము బలిసి పోలేరమ్మమీఁది కెక్కినట్లే బహిష్కరణశక్తితో మీ రొక్కు చేసితిరో మీయాబహిష్కారము సుగంధభూయిష్ఠము. విశ్వవిఖ్యాతమైన శ్రుతినిగదితబహిష్కారము తిరస్కారయోగ్యము. మీబుద్ధిబలముమాత్ర మా వేదపురుషుని యంతరాత్మ సంస్కరింపఁజేయలేదు కాఁబోలు! కూర్చుండి లేవలేని మీబహిష్కరణమును నిర్భీకముగఁ బత్రికల కెత్తుచు బహిష్కారవాదము దుర్బలమని యనఁగలిగెదరా? ఏమి పూర్వోత్తరసామరస్యము! బహిష్కారమున విలువ గమనించితిరా? ప్రభుశక్తి మానవుఁ డేజాతిలోనుండినను పక్షపాతజనకమగును గాన సర్వపాలనములయందును వేదమునకే యాశక్తి చెల్లవలయునని వారి సిద్ధాంతము. జాత్యంతరుల మోలఁ బరిపరివిధముల మనవి చేసినను వా రీమతముల పవిత్రతకు వెలివారైనపుడు తఱచు విరుద్ధపుఁ దీర్మానములై మతములకు హానికల్గును. కనుక సంఘబహిష్కారపద్ధతితో నసమ్మతిని జూపి కట్టుబాట్లలోనికి సక్రమముగ గ్రహించు వృత్తి యత్యుత్తమముగ నెంచఁబడెను. పగులతోఁ జెప్పి లాఘవపడుట లేకయే యాత్మశక్తితో విజ్ఞానమును గల్గించుకొను సదుపదేశ

మార్గముగ దీనిని బరిగణించిరి. గ్రామపుఁ బంచాయతీలనియుఁ దీర్మానములనియు
నాచరణమునందుఁ బెట్టి న్యాయస్థానబహిష్కరణము లొనర్పఁదలఁచు పూనికను
నీబహిష్కరణమే మొట్టమొదటిది. మన ప్రజాసంస్థలు పాటించునది దీనినే. దీని
మూలముననే మీరు బాగుపఱుపఁదలఁచిన పతితసంకరులు వంకరమార్గములం దున్న
వారు. బహిష్కారమునఁ గావున్నను గొన్నియుండ్లలో నేవ్యక్తిపైననైనఁ గొంచె
మసూయ పొడము కార్య మొనరించిన నట్టియకార్యాచరణునితో మాటలాడకుండుట
మొదట. తరువాత నది తగనికార్యమని ప్రీతికొరబోధ. అదియు వినక ముదిరిన
దండన. దానికి నతిక్రమించిన విడుచుట. ఇంకను సుతిమీఱిన బెదరించుట. సాధ్య
పడకున్న నుదాసీనత. కుటుంబోదాసీనకార్యములతోఁ గుటుంబబహిష్కరణము
ద్వారమున స్వేచ్ఛయొనగూడుట. తదుపరి సంఘకంటకకార్యాచరణము. సంఘ
బహిష్కారము. పిదప గ్రామకంటకత. తద్బహిష్కారము. మీఁదట దేశబహి
ష్కారము. అదియే చాలకాలమైన నాస్వేచ్ఛాసుఖముల విడఁజాలక పరోప
ద్రవకార్యాచరణములలో గుంపుకట్టుచున్న నిఁక సంకరుఁడనియో పతితుఁడనియో.
ఈప్రవాహికలో బహుజనుల నేఁటికిని జూచుచు నీయనుభవమును విమర్శింపఁజాలక
యో మతమును ద్రిప్పుకోఁజాలకయో పరనింద కొడిగట్టిన నేమిలాభము? తర
తరము లట్లుండి తొంబదియేండ్ల తొక్కుడు సంతానవాంఛ గలిగిన ట్లిది గలిగిన
భగవత్సంకల్ప మట్లున్న దేమో? శుభాశుభముల మన మేల కాదనవలె? నేఁటికైన
ను సంఘదూరులైన మన సోదరులకు సంఘానుకూలవాంఛ భగవానుఁడు కల్పించె
ననిన నాయనచమత్కార మనిర్వాచ్యము. అశ్రుతపూర్వము. అట్లే పునీతులఁ
జేయవలసివచ్చిన జరిగినకాలమునకుఁ జాలిన పశ్చాత్తాపము నాపథమును విసర్జించు
టకు శపథము దానిలోని యసంతృప్తిని వెల్లడిచేయుట బహిరంగసభ తరువాత
సంఘాచారములు విద్య కట్టుబాట్లు కొన్నాళ్ళు నియమించుట వానియం దుత్తీర్ణు
లైనఁ గ్రమక్రమముగ వేదోదితప్రాయశ్చిత్తపూర్వక సంస్కరణముఁ బతితసోద
రోద్ధరణము నూఁదిన పుటములోనున్న బంగారమువలె వారిలోఁగల పారిశుద్ధ్య
సాత్వికతలను మనముగూడ శిరసావహించుట తటస్థించును. లాతివా రట్టియకార్యా
చరణ మొనర్పకుండ నంతటి ప్రాయశ్చిత్తాదినియమభయముతో స్వస్వనియతధర్మ
ములలో మెలఁగవచ్చును. దయాశూన్యులై సనాతను లిట్లు కోరఁదగదని మీ రన
వచ్చును. మీరిపు డడుగుచున్న స్వరాజ్యమునుగుఱించి పాలకు లేమనుచున్నారు?
వా రిదియు నక్రమమందురా? ఎంత యక్రమమని త్రోసిపుచ్చినను గొంతయైనను
సత్య మందు లేదా? తిలకింపుఁడు. కేడీలిస్టులోఁ జేర్చిన దొంగను నిందితుఁడుగాఁడని
నిరూపించిన తరువాత ననుమానాస్పదుఁడుగ నొక సం॥ ముంచుట యా సం॥ అతని
యందు నేరముల రిపోర్టులు లేకున్న నిర్బంధమును బూర్ణముగఁ దొలఁగించుట.
జమీను మొదలగు వారసత్వపుహక్కులు ప్రసాదింపవలసినప్పుడు కొన్నియేండ్లు
కాండెక్టును తెలిసికొనుట కవధియిచ్చుట మంచిస్థితిలో నున్నఁ బ్రసాదించుట.
ఉద్యోగము లిచ్చుటలోఁ గొన్నా ళ్ళ్యాక్టింగుగను పిదప ఖాయముగను. రోగశాంతి
యైనను బథ్యపానాదులకు గడువొసంగి పిదప స్వాతంత్ర్యముగ విడుచుట. గడువు

లోపల దోషించిన మార్గాంతరమున శాసించుట. పిపీలికాదిబ్రహ్మపర్యంతము నంతులేనిదైయున్న కట్టుబాటుచట్టము లాయరులయ్యుఁ బతితోద్ధరణమున మీరిది గమనింపకుండు టేల ?

సంస్కారప్రియు లాత్మమార్గావలంబనమున కల్పిత పాఱఁదోలి సర్వజ్ఞత్వ మొనగూర్పఁదలంచినను సంస్కర్త లోకలాభముకొఱకు యత్నించునుగాని సంస్కారాలసుఁడై సంస్కారప్రియవాంఛల వెల్లడింపఁడు. సంప్రదాయమెఱుఁగక గీట్లు పెట్టువారెల్లరును సంస్కర్తలా ? ఇది సంస్కృతయా ? ఎట్టుల మొఱకులకు స్వాతంత్ర్యమిచ్చెదమని దురాశగొలిపి వర్ణాశ్రమధర్మముల లూటీచేయ సాహసించి నగుబాటొనయుచున్నారో యట్లే దీనుల నుద్ధరింప దేశదారిద్ర్యమును బాఱఁదోలుటకుఁగూడ మీరు ముంజేతఁ గంకణము ధరించియున్నారుగా ! దీనికి సనాతనులు మీ కాటంకపడలేదుగా ! ఇఁక నాటంకపడువారు ధనికులు. లేదా ప్రభుత్వము. దౌర్జన్యముగ మీరు దుర్బలముగనున్నదని సనాతనమతమును గోటమీట బాడిసాగించి నట్లే దీనోద్ధరణమునకు భాండాగారముల లూటీల కేల నడుముగట్టుకున్నారు ? అది యప్రధానమనియా ? తేలికగ లేదనియా ? దెబ్బ లబ్బుననియా ? మానవ ధర్మముగనుక భీరుత్వ ముండవచ్చును. ఆభాగమును మీసూత్రములలోఁ దొలఁగించుకొని భారతీయ సనాతనధర్మనిర్మూలనాధ్యాయములోనే కాలము గడపెదమని యథార్థము నేల ప్రకటింపరాదు ? సత్యము సత్యమని మీ రనునది కొంతవఱకైన ననుష్ఠించినవారగుదురే. సనాతనుల కిడుచున్న యొత్తిడిలో నెన్నవవంతైనను బీదల యనుకూలధనప్రదానమునకు మీ రెచ్చట సాగించుచున్నారో వ్రేలెత్తి మీ తత్త్వ విమర్శతో రూపింపుఁడు. ఏశాస్త్రము లేకయే హరిజనోద్ధరణమునకు మీవాద మీస్థితిలో నున్నది. మీప్రత్యుత్తరము మేము చూచిన మీసంఘమే పద్ధతి యవలంబింపవలసినదియు మనవిచేయఁదగియుండును. విపరీతజ్ఞానఫలిత ప్రౌఢావివాహాది సంస్కరణలాలసలోని నష్టిని మీకుఁ దెల్పవలసిన యవసర మేర్పడునట్టుల మీ రొనర్చిన విన్నపించెదము. వోట్లకై చేతులెత్తుట లక్కఱలేదు. ఆసంస్కృతుల తీర్మానము లుపాదేయములుగా నక్కఱలేదు. సంఘము నుద్ధరించుకొను భాగమునఁ బ్రధాననాయకులు సంఘీభావమున నిరూపింపవలయునుగాని యేమియు నెఱుంగని వారి వోట్లేమిపనిమీఁదఁ బడును ? మన మిండ్లుకట్టునప్పుడు రేకవసరమా గోడ యవసరమా యిటిక బాగా, రాయి బాగా, గచ్చుసున్నము బాగా యను వివేచనమున కడవిలోని చెంచుల, చెట్లక్రింది యానాదుల, బాజాలులలోని కుంటి గ్రుడ్డి జాత్యంతర మతాంతర దేశాంతరస్థుల యాలోచన యవసరమా ? ఎట్టివారిది కావలెను ? అటులనే మీరు విచారించుకొని మీ సూక్ష్మబుద్ధుల నెఱింగించిన మేమే విరమించుకొనవలసి వచ్చుచో విరమించుకొనెదము. సద్ధర్మముగ సయుక్తికముగ మీరు జవాబీయఁజాలకపోయినఁ బశుబల మవలంబింపరాదని మీరనుచున్న సూత్రము మాయందనుగ్రహించి యాచరణమున నుంచుఁడు. ఏపార్టీల కననుకూలుర మగుదుమో యను భయమున వారి ప్రతినిధుల నర్థించి సంస్థలయందుఁ గట్టుదిట్టము లేర్పఱచుకో వచ్చునుగాని యేప్రతినిధు లక్కఱలేక చిక్కిన యుమ్మడి బట్టెగొడ్డు

వలె సనాతనధర్మమొకటి చిక్కినదా ? ఈహరిజనోద్ధరణమునకు మీ పవిత్ర్యతర మును జూచి తక్కిన భాగములకు మాయభిప్రాయములు మనవి చేయఁదలఁచి యున్నారము. చిత్తగింపుఁడు.

—♦ శ్రీశ్రీశ్రీ జగద్గురు పుష్పగిరిపీఠాధిపతుల విశ్వరూపయాత్ర ♦—

(విద్వాన్, అంబడిపూడి నరసింహశాస్త్రిగారు)

తే. గీ. జయము చంద్రమౌళీశ్వరార్చనవిలోల
మానసాంభోజులకు యతిమండనులకు
పుష్పగిరిపీఠికావసన్మూర్తులైన
శ్రీనృసింహభారతి గురుశేఖరులకు. 1

తే. అభినవోద్దండమహితవిద్యానృసింహ
భారతీదేశికేంద్ర! తుభ్యం నమోస్తు.
సమధికధ్యానయోగనిష్ఠావిధాన
పరమపావనమూర్తి! తుభ్యం నమోస్తు. 2

కం. యతిలోకసహజమౌ మీ యతిలోకవిరాగగుణము లార్యావర్త
స్తుతిపాత్రములు విరాగార్పితవృత్తీ! పుష్పశైలపీఠాధిపతీ! 3

శా. చాతుర్మాస్య వ్రతపరిభావకలనాసంపత్తి నేకాగ్రతన్
చేతోమోద మెలర్పఁగా నెఱపి విస్తీర్ణప్రపంచాంతరో
ద్యోతంబౌ పరమాత్మరూపకలనోద్యోగంబు చేఁబూని మీ
రేతేరం గనుపండువయ్యె గురుమూర్తీ ! నారసింహవ్రతీ! 4

తే. గీ. యతివరేణ్యుల కాచార మనుసరించి
గడపనగును జాతుర్మాస్యకవ్రతంబు.
కానఁ దద్వ్రతవిధుల సాంగముగఁ దీర్చి
తరలితిరి విశ్వరూపయాత్రకు మహాత్మ !
జయము నరసింహభారతీస్వామి ! జయము. 5

—♦ ఆంధ్రవాఙ్మయ సేవాసమితి ♦—

(విశ్వ వేంకటేశ్వరులుగారు)

సీ. గోదావరీ పావనోదారవాఃపూర
మేపిటిపొలములో నెసఁగుచుండు

భద్రాచలేశ్వరు భద్రసన్నిధియందు
నిత్యంబు సేవిడు నిలిచియుండు
విద్యాభిమానులౌ వితరణశీలు రే
వీటిలో సత్కీర్తి వెలయుచుంద్రు
ఒలసి కిన్నెరసాని సులలితకావ్యతం
త్రిరహస్యమ్ము లేకేవ్ర మొరయు
అట్టిబూర్గముపాటిలో ననుపమాన
శారదాసేవచే జన్మ సార్థకముగ
ఆంధ్రవాఙ్మయసేవా సమాత్తమైన
యశమునందిది యీసమితి పొల్పారుఁగాక.

—♦ తిరుపతివేంకటేశ్వర కవులు ♦—

సీ. తమకవితామహాధారాపగాజలం
బందు శిష్యులు మున్కలాడుచుండ
ఎదిరినవారిని నిలఁ దృణంబులమాడ్కి
భంజించి సత్కవిప్రతతిలోనఁ
బేర్కొన్న గురువులు పెరిమతోఁ దిర్పతి
వేంకటేశ్వరుల కవిత్వమహిమ
చెప్పఁగావలెనన్నఁ జేటభారతమాను
వారిఁబోలినవారు వసుధఁగలరె ?
నవకవిత్వంపుధాటిలో మివులుచుండి
శీఘ్ర మదవధానధోరణిఁ జెన్నుగాంచి
రసములకు నిల్లు వాఙ్మయరాజ్ఞిఁ గొలిచి
మహిమఁజూపిరి వారి నమస్కరింతు.

—* సన్మానప్రకటన పత్రిక *—

శ్రీ శ్రీజగద్గురు విరూపాక్షపీఠాధ్యక్షులు గద్వాలనగర ప్రవేశమొనర్చిన (17-6-36) సమయమున "తర్కవేదాంతవిశారద" "ఉపన్యాసకేసరీ" త్యాది బిరుద విరాజిత బ్ర॥ వే॥ ముదిగొండ వెంకటరామశాస్త్రిగారు రచించి స్వాగతోపన్యాస మొసంగిరి. శ్రీవిద్యానగరసామ్రాజ్యప్రతిష్ఠాపనాచార్య పీఠప్రభావమును గుప్తముగ వెల్లడించిరి. తరువాత శ్రీవారి సన్నిధి నవిచ్ఛిన్నముగ వారమురోజులు సా॥ 4 గం

టులనుండి 6 గంటలవఱకు సకలమతసామరస్యముఁ గరతలామలకముగ మృదు మధురశైలి నాంధ్రభాషలో శ్రుతిస్మృత్యుదాహరణములతో విద్వదాదరపాత్ర ముగఁ బండితపామరుల కాత్మానాత్మవివేకముం బ్రతిపాదించి ప్రశాంతి ప్రసా దించినారనుట యతిశయోక్తిగాదు. పుస్తకసహాయము లేక యనన్యసామాన్యప్రతిభా ధోరణులతోఁ దత్త్వమార్గమును సకలమతసామరస్యముగ నిట్లు సూచించి సర్వుల నానందింపఁజేయుచున్న వీరి లోకోపకారము వర్ణనాతీతము. తత్త్వవేత్త. ఆచరణ యందుంచినవాఁడు. శీలసంపన్నుఁడు. మహావక్త. నిష్కామకర్మయం దుత్సాహి. కనుకనె వీరి దేశసేవ గణనార్హమైనది — పరమ ధర్మస్వరూపిణియైన శ్రీ గద్వాల్ మహారాజ్ఞీ పరిపాలనోపేతమైన పుణ్యభూమి, పండితవరేణ్యుల కాస్థానము, శ్రీ జగద్గురు సన్నిధానము - ఇట్టి పరమపావనసమావేశములో నిర్వివాదముగ సకలమత సామరస్యాద్వైతప్రతిపాదనా ప్రణాళిక నేర్పుగ వివరించి వీరు ధారాళముగ మమ్మానందపఱచుటవలనను, శ్రీశ్రీ మహారాజ్ఞిగారుగూడ వారి స్థిరతరోపదేశ మార్గము ప్రశంసార్హమని గమనించుటవలనను శ్రీ శాస్త్రిగారికి గౌరవపత్రపుర స్సరముగ మా ప్రేమోత్సాహముల నిట్లు ప్రకటించుచున్నాము — శ్రీ శాంకరవిద్వ ద్వైదికాద్వైతసిద్ధాంత మిదియే యనియు నది ప్రయత్నపూర్వకముగ నేఁటినుండి సర్వతోముఖముగ సాధింపవలెననియు నందఱు శ్రద్ధాళువులైరి. అడిగిన పండిత ప్రశ్నముల నిదానముగ శాస్త్రీయముగ సాధించి ప్రత్యుత్తరములతో నానందింపఁ జేసి శ్రీవారి సన్నిధి కన్నిమతముల పండితుల నాకర్షింపఁజేసిరి.

ఇట్టి శ్రీ శాస్త్రిగారికిఁ జిరాయురారోగ్యముల నొసంగి ప్రపంచశాంతిని సమకూర్పఁగాతమని భగవానుని బ్రార్థించుచున్నారము.

ఇట్లు,

శ్రీ గద్వాలసంస్థానసంస్థిత

1. పుల్లగుమ్మి వెంకటాచార్యులు,
   వైయాకరణవిద్వత్పరీక్షాధికారి
2. పండిత వెంకటకృష్ణాచార్యులు
3. పండిత దేశికాచార్యులు
4. పండిత తోపు వెంకటాచార్యులు
5. భాస్కరం సుబ్బావధానులు
6. వికటకవి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రులు
7. ద్వైతాద్వైతన్యాయమీమాంసాపండిత
   గుండేరావు,
   గద్వాల్ డిస్ట్రిక్టు జడ్జి.

8. పండిత ముదాంక ర్త వెంకటాచార్యులు
9. పండిత కుందాపురం కృష్ణాచార్యులు
10. శతావధాని, గాడేపల్లి వీరరాఘవశాస్త్రి
11. రాళ్ళపల్లి కృష్ణావధానులు, వెదపరీక్షాధికారి
12. వ్యాకరణపండిత హారతి దీక్షాచార్యులు.

బ్ర. గాడేపల్లి వీరరాఘవశాస్త్రి కృతాభినందనము.

సీ. ఆవేశమైన దేవానులాపముగాని
చదివిన శాస్త్రాల చదువుగాదు
పరతత్వ మెఱిఁగిన పారవశ్యముగాని
జంత్రాలపల్కుల సరణిగాదు
సోదరప్రేమతోఁ జొక్కిపల్కుటకాని
స్వోదరపూరణ స్తుతులుగావు
భాష్యగీతాసూత్ర ఫక్కిక లగుఁగాని
నమలు ఫుక్కిటిపురాణములుగావు
తే. గీ. గద్దువాలసభా బుధాగ్రమున నిలచి
శ్రీజగద్గురుశంకరాశీఃప్రసక్తి
సన్నిధిప్రబోధవక్త్రవై సల్పితౌర !
ప్రేమ ముదిగొండ వేంకటరామశాస్త్రి !
తే. గీ. విస్తరించినదా పరవస్తుచింత
అధివసించినదా యనభ్యసనపథము
వదలుటా చిరవాసనావాసితంబు
హర్ష మొదవించుటనిన సాహసము మిత్ర !
ఉ. దేశికసార్వభౌము లుపదేశమొసంగఁగ దేశదేశవా
దాశనులై విరోధిజనతాశనులై ప్రతివాదివాయువా
తాశనులై ప్రతిష్ఠితమతంబని నిల్పిన మార్గఫక్కి యీ
పేశలపద్ధతిన్ నుడువఁ బ్రేమ జనింపదె మిత్రరత్నమా !
సీ. అభినవోద్దండ విద్యాశంకరాచార్య
సచ్చిదానందులౌ స్వామి లెదుట

సత్ప్రతిష్ఠాపనాచార్యవిద్యారణ్య
దేశికేంద్రులు మనోధిత్యక వయి
తద్దేశికత షణ్మతస్థాపనాచార్య
శంకరభారతుల్ చక్షులంచు
తత్తద్గురుపరంపరాప్తకావ్యస్మృతి
శ్రేణు లాద్యంతాగ్రజిహ్వాయంచు
గీ. ఉభయభారతి వీణాప్రియుజ్జ్వరవము
లాదరంబున హృత్ప్రణానాదమందు
మేళవించి వచింపఁగా మీకె తగును
రమ్యతరకీర్తి ! వేంకటరామశాస్త్రి !
కం. అద్వైతద్వైతవిశిష్టాద్వైతబుధేంద్రకోటు లయ్యారె యనఁగ్
విద్వద్వర్ణితపథమున సద్వస్తుపరిదర్శనంబు సలిపితివి సఖా !

—♦ పొగ త్రాఁగరాదు ♦—

ఈమాట యెఱ్ఱయక్షరములతో నచ్చువేసిన కాకితపుముక్కలు చాల మోటారు బస్సులలో నతికింపఁబడియున్నవి. ఇఁక బస్సులో నెవరును చుట్ట, బీడి, సిగరెట్టు పీల్చరు కాఁబోలు ననుకొన్నాను. ప్రయాణము సాగింతుముకదా! డ్రైవరు వెలిఁగించినాఁడు గోల్డుఫ్లేకుసిగరెట్టు. కండక్టరు వెలిఁగించినాఁడు, ఓ టర్కీటోపీమార్కు బీడి. కారులో ఫ్రంటుసీటులో నున్న హెల్తు ఇన్స్పెక్టరుగారు వెలిఁగించినాఁడు కేపికట్ సిగరెట్టు. అందులోనే యొక డాక్టరుగారు ప్రయాణము సాగించుచున్నాఁడు. ఆయనగూడ నేదో చౌకరకపు సిగరెట్టు వెలిఁగించినాఁడు. డబ్బిచ్చినాఁడో లేదో యొక పోలీసాఫీసరు ప్రయాణము చేయుచున్నాఁడు ఆయన యొక చేబ్రోలుచుట్ట వెలిఁగించినాఁడు. 75 యేండ్ల యొకబామ్మగారుగూడఁ జుట్ట త్రాఁగుటకే కాఁబోలు నిప్పుపెట్టె యడిగినది. ఇదంతయుఁ జూచునప్పటికి నాకేమియుఁ దోఁచలేదు. పొగ త్రాఁగరాదని వ్రాసియున్నదికదా, మీరందఱు నెందుకుఁ జుట్టలు త్రాఁగుచున్నా రన్నాను. అని అంతేలే, కారులో రూల్సిట్లే యుండునన్నారు. కొందఱు పరుషముగా నన్నారు. కొందఱు స్పోర్టుసుమెన్ స్పిరిట్‌తో నవ్వుచున్నారు డాక్టరుగారు మాత్ర మది దురభ్యాసమే యని క్షమాపణధ్వని (apologetic tone) తో ననినారు. పొగత్రాఁగుటమాత్ర మెవరును మానలేరు. దీనిని మానిపించుమార్గ మేమియు లేదనియే మీ యుద్దేశమా? (ప్రకృతి)

—♦ తిక్కనగారి నైపుణ్యం ♦—

(చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు)

...అహోబలుడికి ఆంధ్రభాషను సర్వవిధాలా సంస్కృతంతో తులదూగిద్దామనిన్నీ తానేమో పతంజలితో తులదూగుదామనిన్నీ వుద్దేశం వున్నట్టు అతని ధోరణి చెపుతుంది. ఇప్పటికి ముప్పదియేండ్లనాడు మేమున్నూ అహోబలునితో పాటుగానే అనుకొనేవాళ్ళం. క్రమంగా పరిశీలిస్తే శ్రీనాధాదులందఱున్నూ నన్నయ్యగారి ప్రయోగాలతోపాటుగానో అంతకన్న అధికంగానో తిక్కన్నగారి ప్రయోగాలను గౌరవించినట్లు కనపడడంవల్ల ఆ దురభిప్రాయాన్ని మార్చుకోవడం యుక్తమని తోచింది. నన్నయ్యగారివలెనే తిక్కన్నగారుకూడ ప్రయోగవిషయంలో మాన్యులే. లక్షణగ్రంథకర్త లొక్కొక్క రొక్కొక్క చేదస్తానికి అలవాటుపడుతూ వుంటారు. అప్పకవి భాగవతంకన్న యెన్నోరెట్లు లాక్షణికసమయాలను వుల్లంఘించినవారి గ్రంథాలనుంచి యెన్నో లక్ష్యాలు స్వీకరించికూడా భాగవతాన్నుంచి వక్కలక్ష్యాన్నిన్నీ చూపక పెద్ద అపరాధం చేశాడు. దానితో యిటీవలవారు కొందఱు భాగవతప్రయోగ మనడంతోనే వ్రల్లిగడ్డవలె యీసడించడానికి ఆరంభించారు. యీమహాఘోరాన్ని సహించుకొని కూచిమంచి తిమ్మకవిగారు ఆ బహిష్కారాన్నైతే తొలగించారు గాని యేమైనా పిడివాదప్రవీణులు మాత్రం ఆ వెనుకటిపుంతకే వెళ్ళుతూ వుంటారు. సాధ్యోహి రసో యథాతథం కవిభిః అంటే అమహనీయునికే చెల్లింది. ఎంతకష్టపడ్డా ప్రాస యెత్తుకున్నా పద్యం కుదురుతుందా ? 4 చరణాలింటికిన్నీ నాలుగు యత్యర్థపు పదాలున్నూ నాలుగు ప్రాసార్థక పదాలున్నూ పోతన్నగారి కవిత్వంలో మందుకూడా కష్టసాధ్యం. అందఱునూ యెరిగిన విషయమే కనక పద్యాలు వుదాహరించి చూపడం అనవసరం. తిక్కన్నగారివలెనే పోతన్నగారున్నూ విమర్శనగ్రంథాలు యేమిన్నీ వ్రాసినట్లు కనపడదు. అంతమాత్రంచేత విమర్శకుడు కాడనుకోవలసిందేనా ? ఆపద్ధతిని నన్నయ్య మాత్రం విమర్శకుడు కాగలడా ? కాళిదాసు కాగలడా ? విమర్శనమంటే పూర్వకాలంలో యేలాటి అర్థంలో వుండేదో కాని యీ యిరవయ్యో శతాబ్దంలో శుద్ధ అనవసరపు వెక్కిరింపు కిందికి దిగిందనికాని లేదా తిట్లు తిట్టుకోవడంలోకి దిగిందనికాని అంటే అంగీకరించనివారు వుండరు. ...కొందఱు తిక్కన్నగారికి ధర్మవర్తితార్థం బోధపడక వదిలిపెట్టినట్లు పలికేవారున్నూ వున్నారు. అట్టివారినిగూర్చి వ్రాయడం బొత్తిగా అప్రస్తుతం...వకాయన తిక్కన్నపద్యాలు బాగున్నాయి కావనిన్నీ అంతకన్న మిన్నగా రచించి చూపుతాననిన్నీ కొన్నిపద్యాలు వ్రాసి పత్రికలలో ప్రచురించి వున్నారు. ఆయనకూడా కవి అనడానికి సంశయంలేదు కాని తిక్కన్నగారి పద్యాల్లో ఆయన కనపటిచిన వ్యత్యాసాలు నిలిచేవి కావు. యేకథాసందర్భం అతుకుపెట్టేటప్పుడో నీరసంగావుండడాన్ని సహృదయులు గణించరు. తగినఘట్టాలలో అంటే యీశకుంతలాదుష్యంతసమాగమంవంటి స్థలా

లోనో కవిత్వం నీరసమైతే దాన్ని గణించవలసివస్తుంది. తిక్కన్నగారు వేదాంత ఘట్టంలో

కం. సంగము బంధం మఖిలని
స్సంగత మోక్షంబు. బహువిచారము లేలా ?
పింగజటాజూటకలిత !
గంగాబాలేందుమహిత ! గౌరీసహితా !

అనే పద్యంలో వకవంతుమాత్రం అవసరానికిన్నీ మూడువంతులు అనవసరానికిన్నీ వినియోగించారు. ఇక్కడ రసంచెడదగ్గవిషయం లేదు. భగవంతుడైన యీశ్వరుడికి పెద్దవిశేషణం వేసి పద్యం ముగించారు. ఏమి సెప్పుదుం గురునాథా అన్నచోట కల్పించిన శ్లేదేనా కథ కల్పిద్దామంటేకూడా అవకాశం లేదు. ప్రాజ్ఞు లిట్టి స్ఖాల్యాలు గణింపరు. యితరులు భారతకవులవి కాకపోయినా మరొకరివయినా యిట్టివి వెక్కిరించి తీరని అపయశస్సును సంపాదించుకొని నిలవచేసుకుంటారు. అది ప్రస్తుతకాలానికే కాక భావికాలానికికూడా యెంత అవకాశంచేయాలో అంతా చేసితీరుతుంది. ఇంగిలీషు చదువుకొన్నవారి విమర్శనలు బాగుంటాయని వినడం కలదు. ఆభాషలో వ్రాసినవాటిమాట నేను జెప్పజాలను గాని వారిలో మంచి ప్రవీణులైనవారే తెలుగులో వ్రాసిన విమర్శనాలు కొన్ని చదివిచూచాను. అవికూడా డిటోప్రకారంగానే కనపడ్డాయి. అందులో వ్యక్తిదూషణ లేకపోవడం మాత్రం గోచరించింది. అందుకు కారణం వారు విమర్శించిన గ్రంథం ప్రాచీనకవికృత మవడంచేత ఆగ్రంథకర్తకున్నూ విమర్శకులకున్నూ వ్యక్తిగతమైన వైరం లేకపోవడమే. తిక్కన్నగారి రచనలో యెంత లోకజ్ఞానం వెల్లడిఅవుతుందో ఆయన బిరుదంలోకూడా అంత లోకజ్ఞానం వెల్లడి అవుతుంది. ఆయన బిరుదాలు స్వయందత్తాలే అని నా వూహ. విజ్ఞులు గమనింతురుగాక. ఉభయకవిమిత్రుడనికదా ఆయనది వకబిరుదు. ఇది నేతిబీరకాయవంటిదో లేక సార్థకమో చదువరులే నిర్ణయించుకొందురుగాక. అనవసరపు తగాయిదాలు కవులతో పెట్టుకొనేవాడైతే యీబిరుదు లోకసమ్మతికి పాత్రం అవుతుందా? యింకొక్కబిరుదు సోమయాజితోపాటుగా బుధారాధనవిరాజి అనేది. యీబిరుద మెంత సార్థకమో? కేతన్నగారి

సీ. సుకవీంద్ర బృంద రక్షకుఁ డెవ్వఁడనిన వీఁ
డనునాలుకకుఁ దొడవైనవాఁడు

అనేవర్ణనమే తెలుపుతుంది. సమకాలీనుడగు వక మహాకవిచే అలా వర్ణింపబడడం యెంత అర్హతకలవారికో కాని తటస్థిస్తుందా? బిరుదంటూ అనేటప్పటికి తాత్కాలికులలో బలువురు ద్వేషించి వెక్కిరించడమే అనుభూతం. చూడండీ మహా విద్వాంసుడున్నూ మహాకవిన్నీ అయిన సర్వజ్ఞసింగభూపాలునికి వున్న సర్వజ్ఞబిరుదాన్నికూర్చి యెవరో కవి

క. సర్వజ్ఞనామధేయము శర్వునకే రావుసింగజనపాలునకే
ఉర్విం జెల్లును. ఇతరుని సర్వజ్ఞుండనుట కుక్క సామజమనుటే.

అని స్తుతిచేస్తూ సమయోచితంగా వర్ణించేటప్పటికి ఆ సభలోనే వున్నవాడో మరొకడో వకకవి యెదుటనో చాటుగానో ... ఆ అతిశయోక్తి సహింపక రావు సింగజనపాలునకు, ఏయుర్విం జెల్లును, అని ప్రశ్నార్థకంగా విరిచి అన్వయించి యీశ్వరుడికంటె యితరులైన సామాన్యులలోనే సింగభూపాలుణ్ని కూడా చేర్చి వారికి పట్టిన దురవస్థనే పట్టించినట్లు వినడం. యిప్పటిలాగ అప్పుడు యీలాటివిషయాలకు పత్రికలైతే లేవుగాని లేకపోయినా కాదగ్గపని గంఘర్వ్యలే తీర్చివేసేవారు. అది శిష్టపరంపరాద్వారాగా వాఙ్మయంలో నాటుకుపోయేది. యీలాటి అర్థాంతరాలు చెప్పడం యిప్పుడున్నూ వుంది. సుమారు ముప్పైయేండ్లనాడు వకమహాశాస్త్రిగారు మాకవిత్వాన్ని విమర్శిస్తూ కింకవీంద్రఘటాపంచానన అనే మాబిరుదానికి కొంగముట్టివంటి ముట్టికలవారు అంటూ అపార్థంగా రాకపోయినా వస్తుందంటూ వ్రాసి కొంత పరాక్రమించారు. రాకపోవడానికి కారణమేమిటంటే అయన కింకుత్సితమైన క ఉదకమందలి వీంద్ర పక్షిశ్రేష్ఠములయొక్క అని అర్థం వ్రాశారు. మేమేమన్నామంటే నీటిపక్షులలో శ్రేష్ఠత్వం హంసలకు సంఘటిస్తుందిగాని కొంగలకెన్నటికిన్నీ సంఘటించదు కాబట్టి మీమనోరథం లేశమున్నూ నెరవేరదని పూర్తిగా పండితజనామోదంగా నిరుత్తరంగా ఖండించికూడా అభ్యుపగమ్యవాదానికి వుపక్రమించి అయ్యా! మీకంతకుతూహలం వుందో అట్టినీచార్థం చెప్పడానకు అందుచేత మేము మీకోరిక నే నెరవేస్తూవున్నాము, మీరు మమ్మల్ని కొంగలుగా అపలపించారుకనుక ఆకొంగలికి ఆహారం పెట్టడం మాకు అవశ్యకమవడంచేత మిమ్మును మేము చేపనుగా అందులోనున్నూ మంచిచేపనుగా సమర్థిస్తాము చూడండి అని వారిపేరుకు మేమీక్రిందిరీతిగా అర్థాన్ని నిర్వచనం చేసివున్నాము. అప్రస్తుతమే అయినా చిరకాలంనాటి విషయంకనుక నవకవుల వినోదార్థం కొంచెం యిక్కడ చూపుతున్నాను. కాశీనాథ అని ఆక్షేపకుల నామం. దానికి చేపఅనే అర్థం యేలా వచ్చిందో చూడండి. క అంటే నీరు. దానిని అశ్నాతి భక్షించునది లేక నీటియందు నివసించునది. శసయోరభేదః. అస ఉపవేశనే. కనుక చేప. ఇక్కడికి కాశివరకును తేలినట్లయింది. ఆచేపలకు నాథుడు అంటే శ్రేష్ఠమయిన చేప అని తేలింది. దీనితో కొంగలకు ఆహారం చక్కగా పెట్టినట్లయింది. అంతలో శాస్త్రిలవారున్నూ సంతోషించి విరమించారు.

పాండిత్యం వున్నవారితో వాదోపవాదాలు వస్తే చక్కగా వాక్యోపవాక్యాలు యిట్లాగే నడుస్తాయి. అందులో తమోగుణప్రధానమైన మాటలు కొన్ని వున్నా అవి వినేవాళ్ళకు కొంతమట్టుకేనా ఆహ్లాదం కలిగిస్తాయి ఆసురకు తక్కువవారితో వాదం వస్తే వారిచేత వట్టితిట్లు తిని వూరుకోవడమే ఫలితం. మళ్ళా తిట్టరాదా అని ప్రాజ్ఞులనరు. యెందుచేత ? ఆవలివారి తిట్లకు యేవగించుకొంటూ

యీవలివాళ్ళను తిట్టవలసిందని యెందుకంటారు. పనిలోపనిగా చిరకాలంనాడు మాబిరుదానికి పట్టిన దురవస్థను సంగ్రహంగా వివరించడమున్నూ దాన్ని తొలగించిన ప్రకారం కొంత తెలపడమున్నూ అయింది. తరువాత రమారమీ మూడుదశలు నిశ్శంకంగా నిరంకుశంగా జరిగి పోయాయి. అంతట్లో ముదిముప్పున బాలపాపచిన్నె మాబిరుదుకుమళ్ళా సంప్రాప్తించింది. యెన్నిరోజులలో నిశ్శబ్దంగా కాలం గడిచినా అది లెక్కలోది కాదనుకోండి. మాబిరుదుకు కాస్త గోచిపెట్టింది మొదలుకొని యిలాటివాక్కుంఠాలతోటే భుక్తమవుతూవుంది. ఇప్పటికేనా విశ్రాంతి కలుగుతుందేమో అనుకుంటే పడకకుర్చీభావాలు అంటూ ఆంధ్రవారసంచికలో వ్రాసినట్లు యేపుత్రిమొత్రివాత్రలో వ్రాయకుండా కాలం యిప్పుడున్నూ జరగడం లేదు. దీనియందు మాకు విసుగపుట్టి చిరకాలం అయిందన్నమాట మాపాండవోద్యోగంలోవున్న తినజాలను నెత్తురుకూడు మాధవా అనే ధర్మరాజువచనంవల్ల వ్యంగ్యమర్యాదావేత్తలు గ్రహించేవుంటారు. ఆయన అలా అన్నప్పటికీ తుదకు ఆయనకూ నెత్తురుకూడు తినక తప్పలేదు. మాకున్నూ తప్పలేదన్నది ఫలితార్థం. అనేకవిషయాల్లో ఆయన నెత్తురుకూటికిన్నీ మానెత్తురుకూటికిన్నీ పోలికవుంది. వ్యాఖ్యానంచేస్తే గ్రంథం విస్తరిస్తుంది...మాబిరుదానికిగల అర్థాన్ని వ్రాస్తాను. కింకవీంద్రఘటాపంచానన అంటే వినండి. ముందుగా కవీనా మింద్రాః కవీంద్రాః అని షష్ఠీసమాసం చేసుకోండి. కవిశ్రేష్ఠులు అని అర్థం వస్తుంది. తర్వాత కింశబ్దంతోటి కవీంద్రశబ్దాన్ని కలపండి. కుత్సితులైన అనగా ఋజుమార్గవర్తులు కాని కవిరాజులు లేదా కవిచక్రవర్తులు అని ఫలితార్థం. అనగా ఎంతగొప్పకవులేనాసరే వారి వర్తన కుత్సితమై దురుద్దేశంతో మమ్మెదిరించే యెడల అట్టివారియొక్క ఘటాసముదాయమునకు పంచానన సింహాలు తి॥ వెం॥ కవులని తాత్పర్యం. ఋజుప్రవర్తనగల కవిరాజులకును తి॥ వెం॥ కవులకును వివాదముండదని తెల్పుటకే ఆ కింఅనేది విశేషణంఅని సహృదయులు గురుతింపగలరు. ప్రతివాదుల అర్థానికి సమ్మతించే యెడల ప్రతివాదులకే పెద్దచిక్కు వస్తుంది. కింకవీంద్రులకడ నోరుతెరుస్తారనే యెడల వీరు నోరుతెరచినా లేక ఆవలివారిని నోరు తెరిపింపజేసినా వీరిపై పూర్వపక్షాలు చేయడానికి వుపక్రమించేవారు ఆ కింశబ్దానికి గురికాక తప్పదు. దానివల్ల ఆ దురర్థం తమనెత్తికి వచ్చితీరుతుంది. కనక విస్తరింపవలసింది లేదు...తిక్కన్నగారు భగవద్గీతార్థం తెలియకపోవడంచేతగాని లేదా అందులోవుండే విశేషాలు సర్వసాధారణంగా తెలిసిపోతాయనే చుప్పనాతితనంచేతగాని క్లుప్తపరచలేదనిన్నీ నిష్కృష్టమైన విమర్శకు లవడంచేతనే క్లుప్తపరచారనిన్నీ నే నభిప్రాయపడతాను. మఱిన్నీ నాకీమధ్య పనికలిగి తిక్కన్నగారి యావద్భారతాన్నే కాక నన్నయ్య యెర్రన్నగారి భాగాలుకూడా ప్రత్యక్షరపరిశీలనగా చదవడం తటస్థించింది. యెక్కడేనా శాస్త్రవిరుద్ధాలు కనపడతాయేమో అని మిక్కిలిగా వెదకివున్నాను ... తిక్కన్నగారి ఉభయకవిమిత్రబిరుదు నేతిబీరకాయవంటిదనడానికి నాకే కాదు వేరొక్కరికిన్ని నోరురాదు. అట్టిస్థితిలో

కౌముది పూర్వార్థంలో మూడోవంతు చదువుకున్నవాళ్ళకుకూడా గోచరించే యీ స్వల్పవిషయం తిక్కన్నగారికి తెలియదనుకోవడానికి వీలుపడదు. పనిలోపని. బిరుదు తత్సమసమాసంలో తుట్టతుద నుండవచ్చునన్నందుకు తిక్కన్నగారి ఉత్తరరామాయణప్రయోగాన్ని యిచ్చి ప్రస్తుతానికి వస్తాను. పరిగారసన్నాహబిరుదుగలుగ- యీప్రయోగం మా కవిసింహబిరుదుఅనే ప్రయోగానికి జీవకమో కాదో ప్రాజ్ఞులు విచారింపగలరు. ఇట్టి వేవిన్నీ చూడక వృథాగా కాకితాలు నలుపుచేసి లోకాన్ని వంచించే రోజులలో నిజం అబద్ధంగానున్నూ అబద్ధం నిజంగానున్నూ మారడంలో ఆశ్చర్యం వుండదు ... ప్రామాణ్యజ్ఞానమంటూ వుండాలిగాని అది పూజ్యమైనప్పుడు వాదాని కేంతక్కువ? ... రేఫద్విత్వానికి పూర్వం గురుత్వం వికల్పమనే రహస్యం సంస్కర్తలకైతే గోచరించినట్లు లేదు ... అక్షౌహిణి అనడానికి బదులు అక్షోహిణి అని యతిస్థానంలో అసకృదావృత్తిగా తిక్కన్నగారు వాడివున్నారు. పాణినిసూత్రాలనుబట్టిమాత్రమే చూస్తే తిక్కన్నగారి అక్షోహిణికి క్షతిలేదుగాని అక్షౌ దూహిన్యాం అని వార్తికం పుట్టడంవల్ల తిక్కన్నగారి ప్రయోగం యెట్లా వుపపన్నమవుతుందో గోచరించడం లేదు. దీన్నిగూర్చి వైయాకరణులు ప్రష్టవ్యులు. ఇది తిక్కన్నగారు బుద్ధిపూర్వకంగా ప్రయోగించిందే కాని మరొకమాదిరిది కాదు. స్వతంత్రించి ప్రయోగించిందేమో అనుకుందామంటే మునిత్రయాన్ని అతిక్రమించడానికి తిక్కన్నగారి కధికారాన్ని కల్పించజాలం. ఇంకా వ్యవహారబలీయస్త్వాన్ని పురస్కరించుకొని సంస్కృతానికి సంబంధించిన మయట్ప్రత్యయాన్ని తెలుగులో కూడా తనమయము మెడకు ప్రోవులమయము ఇత్యాదిస్థలాల్లో ప్రయోగించిన తిక్కన్నగారిని శిరసావహించడానికి అంతబాధకం కనపడదు. అది తనకు మాతృభూతమైన సంస్కృతభాషతాలూకు ఆస్తికనక యేమాత్రమో కూతురుకు సంక్రమించి శిష్టవ్యవహారంలో ఉండడంవల్ల ఆశిష్టులయందుండే గౌరవాతిశయంచేత సోమయాజులు గౌరవించి ప్రయోగించారనుకొని యథాకథంచిత్తుగా సమర్థించడానికి అభ్యంతరం ఉండదు. ప్రస్తుతం శాస్త్రవిరోధం పూర్తిగా కనపడడంవల్ల తటపటాయించవలసివచ్చింది. ణకారఘటితంగా తిక్కన్నగారు ప్రాసస్థలాల్లో వాడిన దుర్ణయగత ణత్వం నన్నయగారిక్కూడా యిష్టమే కనక శంకించవలసి వుండదు ... నన్నయ్యగారినాటికి ఆ ణత్వం నిర్బాధమే. ఆంధ్రానికి ఆయన పరమావధి. అందుచేత సోమయాజిగారు దాసుగారు నాథుడుగారు తాతగారు యింకా కొందరున్నూ ప్రాసస్థలాల్లో వాడుకొనివున్నారు. చిరకాలభుక్తాన్ని యితరరూల్సు లేశమున్నూ భంగించలేనట్లే దాన్నిన్నీ నవీనసిద్ధాంతాలు బాధించనేరవు డిటో ప్రకారమే శాలీనప్రయోగంకూడాను ... నన్నయ్యగారి నతిక్రమించకుండానే తిక్కన్నగారు చాలావరకు రచన సాగించారు. కాని కొన్ని ఆయనకు కొంచెం భిన్నంగాకూడా ప్రయోగించినవి లేకపోలేదు. అంతమాత్రంచేత అవి దుష్టాలనుకునేవారు అపహాస్యాస్పదులు కాక తప్పదు. యీవిషయం విపులీకరిస్తే చాలా వ్రాయాలి. మచ్చుకు వక వుదాహరణ చూపి కొంచెం వ్యాఖ్యానిస్తాను. నన్నయ్యగారు

కొండొక అనే దాన్ని విశేషణంగానే వాడివున్నారు. ఉదాహరణాలు కొండొక సేపు కొండొకనేల కొండొకకోల లోనైనవి చాలావున్నాయి. తిక్కన్నగారికీ దీన్ని కేవలంగా కొండొక విచారించి కొండొక మనమునఁ జింతించి కొండొక తొలంగి ... యెన్నిటినని చూపేది? శరపరంపరగా వాడిఉన్నారు. అపదానికి మరికొన్ని అర్థాలు సందర్భానుసారంగా చెప్పికొనవలసివున్నప్పటికీ ప్రధానంగా వచ్చే అర్థంమాత్రం కొంచెము, చిన్న అని మాత్రమే ... శ. ర. లో వ్రాసిన అర్థాలతో భారతప్రయోగాలన్నీ చక్కబడవు. ప్రస్తుతం నన్నయ్యగారికన్న భిన్నంగా తిక్కన్నగారు ప్రయోగించినట్లు ఋజువుచేశాను. ... జనులను బేదల సాదల నిత్యంబు అనే నన్నయ్యగారి సభాపర్వప్రయోగాన్ని బట్టి పేదలకును సాదలకును వేదములకుఁ దాపసులకు అని శాంతిలో తిక్కన్నగారు వాడినారు. కాని సంస్కర్తలు సాదలన్ అనేదాన్ని సాధులన్ అని సర్వత్రా దిద్దివేసినారు. ఆ ప్రయోగము చెట్టూ చేమా వగైరాలవంటిది. చెట్టుతో తోవాసంగా వచ్చిన తోడి పెళ్ళికొడుకు చేమకు అన్యత్రవున్న అర్థం యిక్కడకూడా ఉందనుకోవడం భాషా స్వభావవేత్తృత్వానికి భంజకం కాకపోదు. యీ చేమకు అట్టిఅర్థం చెప్పేయెడల యేం చిక్కంటారేమో వినండి, భారతంలో దుర్యోధనుండు తొలంగెం జెట్టుచేమల నడంగి యుండునో? మీరు మెలఁగునెడల నరయవలయు అని ధర్మరాజు బోయ వాళ్ళతో చెపుతాడు. ఇక్కడ తోవాసప్రదమైన చేమకు స్వార్థం చేమదుంపల మడిలో అమట్టలలో దుర్యోధనుడు దాక్కొని ఉంటాడేమో పరిశీలించండి అని ధర్మరాజు పలికిన ట్లర్థం చెప్పాలి. అది సంగతంకాదని సహృదయులకు వేరే చెప్పనక్కరలేదు. యిక్కడ చేమశబ్దం చెట్టుశబ్దార్థాన్నే బలపరుస్తూ చెట్లలోగాని సజాతీయమై రహస్యంగా దాగడానికి వీలుగావుండే మరివకచోటగాని అనే అర్థమే యిస్తుంది కాని స్వార్థాన్ని యివ్వనే యివ్వదు. పేదతోవున్న సాదశబ్దం కూడా పేదలున్నా అటువంటివాళ్లే అయిన బాలురూ వృద్ధులూ రోగులూ అనే అర్థం యిస్తుంది. యిక సాధుశబ్దార్థకమైన తద్భవరూపంగా సాదులు అని దిద్దితేనో? యోగ్యులు అని అర్థం యివ్వడమైతే యిస్తుందికాని అది హృదయంగమం కాదు. పైగా అసాధువులైతే పేదలను రక్షించవలసిఉండదనికూడా అర్థం వస్తే రావచ్చును. ఆఅర్థంకూడా మాకిష్టమే అంటారేమో? మీయిష్టంతో పనిలేదు. అక్కడ కవి హృదయం అట్టిదికాదుకనక అది హృదయంగమం కాదని చెప్పక తీరదు. ఐతే దుర్జనులఁగూడి పేదసాదులను గొట్టు అని భళ్ళానచరిత్రలో వున్న ప్రయోగం గతి ఆలోచించాలా వద్దా అంటే వినండి. అదే అర్థం చెప్పుకొనే యెడల భారతప్రయోగాలు రెండున్నూ హృదయంగమంగా వుండవు. భారతంకంటె యితరం మనకు ముఖ్యంకాదు. సాధులుఅంటే సాధువులైన గోమహిషాదులు అని శ. ర. కారుడు వ్రాశాడు, యీఅర్థం సరసంగా వుంటుందో నేను చెప్పిందే సరసంగా వుంటుందో భారతం చూచి సహృదయులు నిర్ణయింతురుగాక. యింతవున్నా వ్యావహారికంలో వుండే కొన్నింటిని స్వీకరించడానికి నన్నయాదుల సమ్మతి వుండదని తెలప

డానికే... తెలుగునవున్న వ్యాకరణదీపము చిన్నది. నడచుధాతువుకు ప్రేరణరూపం
నడపు అనే కాని నడపించు అనేది నన్నయ్యగారు వాడనే లేదు. తిక్కన్నగారు
శరపరంపరగా వాడివున్నారు. యెన్నిచోట్లనంటారా ? సుమారు వందకు తక్కు-
వుండవనుకొంటాను. దిద్దుతామంటారా! పద్యాలల్లో యతులలో ప్రాసలలోకూడా
వున్నాయి...యుద్ధభాగంలో సారసాంకు అని వుంది. శ. ర. లో దీని కర్థం
వ్రాయలేదు. నాకు అర్థం కానున్నా లేదు. ముద్రాప్రమాదమని తోచనున్నా లేదు.
నన్నయ్యగారికన్న యెన్నో పదాలు తిక్కన్న శుద్ధతెలుగువి మన కర్థంకాకుండా
వాడివున్నాడు. అప్పటి వ్యవహారంలో నెల్లూరు గుంటూరుమండలాల్లో అపదా
దాలు కొంచెె మించుమించు రూపభేదంతో వ్యవహారంలో వుండితీరాలి. కొన్ని
వోరుగల్లుప్రాంతంలోవిగా వుండివుండును. తిక్కన్న ఆప్రాంతానికికూడా వెళ్ళి
నట్లు కనపడుతుంది. అంతేనే కాని అపదాలన్నీ అతని స్వకపోలకల్పితాలుమాత్రం
కావు. అంటే సాంకేతికాలు కావు. సమాసంచేయడంలోకూడా మంచి సాహసాన్ని
తిక్కన్నగారు చూపించారు. ఈవిండ్లు కుఱుచ లలంతిబలంబుల్ అని అర్జునుడు
ఉత్తరుడితో అన్నాడు. అలంతి తెలుంగు. బలము సత్తువ అనే అర్థములో సంస్కృ
తము. అలంతియైన బలముకలవి అని బహువ్రీహి చెప్పకోక తప్పదు. శ్రవణకటువు
వుగా వుందా ? చెడినచిత్తాంభోజుడులాగ అంటే లేదు. శ్రవణపేయంగానే వుంది.
అందుకే కాబోలు యిప్పటివరకింకా దాన్ని సంస్కర్తలు మాటదక్కించుకోలేదు.
యెంతో మార్పనక్కరలేదు. అల్పబలంబుల్ అంటే తీరిపోతుంది. యిలాటివన్నీ
దిద్దితే ఆకవిత్వం తుట్టతుదకు కాళిదాసుగారి కవిత్వం కొంతా మాప్రైత్యంకొంతా
దగ్గరికి దిగుతుంది. కాని యెవడిశక్యం? యెన్నెన్ని దిద్ది పాడుచేస్తూన్నారో పరిమితి
వుందా ? వొక్క వేదాని కంతగా యీదోషం తగలలేదు. యెందుచేత ?
అది శ్రుతి.దానిలోకూడా పాఠభేదాలు లేకపోలేదుకాని పురాణాదులలో వున్నంత
తగా ఉండవు ఈపాఠభేదాలే కాదు. గ్రంథభాగాలకు భాగాలే భేదించినమాతృ
కలు కొన్ని ఉండడంవల్లనే కొందరు తిక్కన్నగారిది వదలపెట్టేరనిన్నీ నన్నయ్య
గారిది వదిలిపెట్టేరనిన్నీ అనడం తటస్థిస్తూవుందిగాని లేకపోతే తటస్థించదు. స్పష్ట
గా సీతాయాఃపతయేనమః అని మాతృకలో వుంటే కుమారస్వామికి నమస్కారము
అని తెలిగించడానికి వారికర్మం యేం కాలింది ? ... కొన్నిచోట్లు సంస్కర్తలు
వృధాగా దిద్దినట్లు సూక్ష్మంగా విచారిస్తే కనపడతాయి. మచ్చు చూపుతాను. యాదవ
వృష్టిభోజాదులెల్ల (అ. 1అ) అని ఉండవలసిన సీసచరణోత్తరదళాన్ని యాదవ
వృష్ణిభోజాదులెల్ల అని దిద్దినారు. ఈదిద్దుబాటులో అర్థం లేశమున్నా చెడనిమాట
నేనున్నూ వప్పుకుంటాను కాని గ్రంథకర్తగా నియమం వృధాగా చెడింది, నన్నయ్య
గారు సీసాన్ని యెత్తడంలో మొదటిచరణంలో యతివిషయం యేలావుంటుందో
చిట్టచివరవరకున్నూ అలాగే వుంటుంది. ఈసంగతి విమర్శకులు పలువు రెరింగినదే
కాని నేను క్రొత్తగా వ్రాసేదికాదు. ఈదిద్దుబాటు అనియమాన్ని భంగిస్తూ వుంది.
వలసినవారు అపదాన్ని పరిశీలింతురుగాక. ఎక్కడో వొకానొకచోట నన్నయ్యగా

[illegible]యమాన్ని అతిక్రమించారుకదా అని తిక్కన్నగారు పూర్తిగా వుల్లంఘించి వేశారు ... యెఱ్ఱన్నగారు ... అరణ్యపర్వశేషం పూరించడంచేత కొంచెంలను [illegible]లావను ఈనియమాన్ని పట్టుకునే సీసపద్యాలు నడిపిస్తూ వచ్చారు ... మేము శ్రీనివాసవిలాసపీఠికలో పురాణము తెల్గొనరించినం గదుక శ్రావ్యతగాంచి మెప్పునకగి సంస్కృతముంగని గేలిసేయుక అని యిప్పటికి సుమారు నలువది యేండ్లనాడే వ్రాయడానికి కారణం చేదస్తంగావుందని తిక్కనాదుల అనువాదానికి సంబంధించిందే అని చదువరులు గమనించకోరుతాను. ఋషికవిత్వాలలో చాలాభాగం పునరుక్తులు వుంటాయని యెరుగనివారు లేరు. కొన్ని తెలిగిస్తే రసాభాసగా వుండేవిన్నీ వుంటాయి ...

—* ధర్మపురి *—

(శేషాద్రిరమణకవులు)

ధర్మపురి గోదావరీతీరమందున్న గొప్ప నృసింహక్షేత్రము. ఇట శాస్త్రవేత్త లగు వైష్ణవులు స్మార్తులుఁ జిరకాలమునుండి నివసించుచున్నారు. భూషణవికాస శ్రీ ధర్మపురనివాస యను శతక మిచటి నృసింహునిగూర్చివడే. పోతరాజు రచించిన దని చెప్పఁబడు నారాయణశతకములోని ధర్మపురి లక్ష్మీనాథుఁ డీగ్రామదైవమే. చరిత్రము నలంకరింపఁదగిన శాసనము లిచటఁ జెక్కులు గలవు. విజయార్కుని కుమారుఁడగు విష్ణువర్ధనుఁ డీధర్మపురి ... రాజధానిగఁ జేసికొని చిరకాలము పరిపాలించి యనేకరాజన్యులను జయించి రాజరాజబిరుదమును గడించి పెక్కుధర్మము లాచరించెను. పాముపాటలోఁ జెప్పఁబడు ధర్మపురియు నిదే. చరిత్రపరిశోధకుల కృషి కింకను నీపూర్వరాజధాని లక్ష్యముకాకపోవుట సంతాపకరము. రామ[illegible] పాలించిన రాజు లీనృసింహస్వామికిఁ బెక్కుధర్మములు గావించియున్నారు. [illegible]కొండ ధర్మకవి కిచటి నృసింహామూర్తి యిష్టదైవము. ఒక యాధునిక కవి జ్ఞానవాసిష్ఠరామాయణము నీధర్మపురిలో నుండి వ్రాసెను. ఇది పశ్చిమచాళుక్యుల రాజ్యపాలనమునను గాకతీయరాజ్యకాలమునను మిగుల వైభవము నొందెను.

సుకన్యాపరిణయము

ప్రథమాశ్వాసము

శా. శ్రీరంజిల్లఁగ భక్తిమై బుధజనశ్రేణుల్ దనుం గొల్వఁ బ
ల్మాఱుం దా గురిజాలపట్టణమునన్ క్ష్మాజాతతోఁ గూడి గం
భీ(రస్వాంతతమై) సువర్ణవిలసద్వేశ్మంబునం బొల్చు సీ
తారామావనిజాని మా కొసఁగు నిత్యశ్రీమనోభీష్టముల్. 1

సీ. పండువెన్నెలడాలు పరిహసింపఁగఁజాలు
చిఱునవ్వు మోమునఁ జెలువుదొలుక
సరసిజంబుల యేపు నిరసింపఁగా నోపు
చక్షులఁ గరుణారసంబు చిలుక
హరినీలముల రంగు నపహసింపఁ గడంగు
చూడాగ్రమున విరుల్ సొంపుగులుక
మించుతీవియ మించు వంచన గావించు
నెమ్మేన హారాళు లెమ్మెలొలుక
అనిశమును భర్తృవామాంకమున వసించి
నర్మగర్భోక్తు లాడుచుఁ బేర్మి వెలయు
మేదురకటాక్షవీక్షాసమేత సీత
సింధువేడుక మాయింట నిలుచుఁగాత. 2

మ. శ్రుతినాదంబును వల్లకీనినదమున్ స్తుత్యంబులై యొప్పఁ బ
ర్వతకాత్యాయననారదాది మునివారం బోలిఁ గీర్తింపఁగన్
శతపత్రాంచితభద్రపీఠిపయిఁ దిన్నం గ్రాలు నా భారతీ
చతురాస్యుల్ గయసేయు(తం గరుణ)వాచాప్రౌఢి దీర్ఘాయువుల్.

చ. సరసిజసంభవాది సురసంఘము గొల్వఁగ భద్రపీఠిఁ గుం
జరముఖ వీరభద్ర శరసంభవ భైరవముఖ్యపుత్రు ల
య్యెరుగడలం జెలంగఁ గర మింపుమెయిన్ నివసించు పార్వతీ
శ్వరులు మముం గృతార్థులుగ సల్పుత వైభవసంచయంబులన్.

చం. ఇరువురు చామరంబులిడ నిద్దఱు కేలు మొగిడ్చి నిల్వ వే
ఱిరువురు పాదపంకజము లింపుగ నొత్త సరోరుహాక్షు లి
ర్వురు సరసంబులాడ ఘన రుక్మమణిస్థగితాసనంబుపై
స్థిరముగఁ గొల్వు చెల్వమరు సిద్ధిగణేశుఁ డడంచు విఘ్నముల్.

సీ. ఏధన్యుఁ డినకులాధీశు ముద్రికఁ బూని
పాథోధిఁ జిఱుకాల్వపగిది దాఁటె
ఏమహామహిముఁ డాయింద్రారి నగరంబు
చొచ్చి భస్మంబుగాఁ జిచ్చునిడియె
ఏపుణ్యచరితుండు భూపుత్రిఁగని రామ
నృపవర్యునకు వార్త తెలుకపఱచె
ఏపవిత్రాపోదయుఁ డీసున యక్షాది
ప్రబలాసురుల నెల్ల భంగపఱచె
ఏఘనుం డుగ్రగంధర్వబృంద మోర్చి
ధరణి ఘూర్ణిల్లఁగా ద్రోణగిరి పెకల్చి
తెచ్చి సౌమిత్రి నసువులం దేర్చె నట్టి
మహితగుణవంతు హనుమంతు మతి నుతింతు. 6

చ. సురవరు వజ్రసంహతికి సుక్కక బల్మి సుధన్ గ్రహించి దు
ర్భర గజకచ్ఛపంబులను గ్రక్కునఁ బాదనఖాళి గ్రుచ్చి దు
ష్కరమగు రోహిణీతరు ప్రకాండము ముక్కునఁ దాల్చినట్టి యా
గరుడుఁడు మా కొసంగు మణికాంచనవస్తుసమృద్ధు లెంతయున్.

క. రుద్రాంశోద్భవుఁడై బలురౌద్రాకృతి దక్షునధ్వరముఁ జెఱచి సురో
పద్రవమెసఁగఁ జరించినభద్రయశుండిచ్చువీరభద్రుఁడు జయమున్.

క. అట్టి సభాస్తంభంబున
పుట్టి కనకకశిపు నఖరముఖములచేత

కట్టల్కఁ జీల్చి చెలఁగిన
మట్టపలినృసింహుఁ డిచ్చు మాకు శుభంబుల్. 9

క. భీషణవిషరదనుఁడు సం
శోషిత రిపువర్గుఁ డ(లఘుశుభ్ర)యశుండున్
పూషాంచిత తేజుఁడు నగు
శేషుఁడు మా కొసఁగుత సవిశేష మృదూక్తుల్. 10

క. మదిఁ బ్రహ్లాదార్జున నా
రద భీష్మ వ్యాస బలి పరాశర రుక్మాం
గద శుక శౌనక ముఖ్యుల
సదయాత్ముల భాగవతుల సంస్తుతిసేతున్. 11

ఉ. క్రూరములైన దుష్టమతకోటులు పాటవమొప్పఁ గ్రమ్మి దు
ర్వారములౌచు వర్తిల నివారణఁజేయఁగ నీశ్వరాంశచే
ధారుణిలోన నుద్భవిలి త న్మతకోటు లడంచి షణ్మతో
ద్ధారకుఁడైన శంకరు పదంబు లెదన్ గదియింతు నిచ్చలున్. 12

సీ. మున్నుగా వాల్మీకి నెన్ని సాత్యవతేయు
పాదాంబుజములకు భక్తి మ్రొక్కి
బాణుని బూజించి భవభూతిఁ గొనియాడి
కాళిదాసకవీంద్రుఁ గరము గొలిచి
ఖండితాఘుని మాఘు గారవంబున నెంచి
బిల్హణు మల్హణుఁ బ్రీతిఁ దలఁచి
పండితాలంకారు దండి కంజలిచేసి
భారవి నేప్రొద్దుఁ బ్రస్తుతించి
శంకరు మయూరు నెంతయు సంస్మరించి
మల్లినాథుని శివభద్రు నుల్లమలరఁ
దలఁచి వినుతింతు మఱి సంస్కృతప్రబంధ
కల్పనాకల్పచణులైన కవుల నెపుడు. 12

ఉ. నన్నయఁ దిక్కయజ్వ కవినాథుని సోముని రంగనాథునిన్
పన్నుగ శంభుదాసకవివర్యుని భీముని నల్లసాని పె

ద్దన్నను నందితిమ్మసచివాగ్రణి భాస్కరపోతరాజులన్
సన్నుతి సేతు నాంధ్రకవిసత్తములన్ మది వాగ్విశుద్ధికిన్. 14

చ. తెలియఁగలేరు కాకవులు దివ్యకవిత్వపటుత్వవైఖరుల్
మలయజగంధసంచయ సమాహితసౌరభ మావరాహముల్
తెలియనియట్లు. కావ్యములఁ దెల్పెడురీతుల మెచ్చునట్టి య
త్తులువలఁ జెప్పనేల విబుధుల్ గల సార సభాంతరంబులన్. 15

సీ. వచియించె నెవ్వఁ డెడ్వర్డు పట్టాభిషే
కాంచిత మృదుపద్యసంచయంబు
కల్పించె నెవ్వాఁడు గద్యపద్యప్రశ
కొండవీటిచరిత్ర గురుతరముగ
వెలసె నెవ్వాఁడు గానవి (ద్యాలోపలఁగూడ.
ప్రావీణ్య మొకకొంత పడయఁగలిగి)
అలరె నెవ్వాఁడు లౌకికానేకకార్యని
ర్వాహకత్వంబున రాజసభల
అట్టి మద్దులపల్లివంశాబ్ధిచంద్రుఁ
డగు గురుబ్రహ్మనామధేయాస్మదీయ
గురువరేణ్యుని విమలాంఘ్రిసరసిజముల
కెలమిఁ బ్రణతుల నర్పింతు హెచ్చుభక్తి. 16

వ. అని యిష్టదేవతాప్రార్థనంబును గీర్వాణాంధ్రకవీంద్రబృంద వందనంబును కుకవి నిందనంబును గురువరాభివందనంబునుం గావించి యే నొక్క పురాతన పుణ్యచరిత్రంబు గద్యపద్యాత్మకంబుగా రచియింపంబూని మద్వంశవర్ణనం బాచరించెద.

—* కర్తృవంశావళి *—

సీ. బలభిన్మణిచ్ఛాయఁ బరఁగు దేహమువాఁడు
విమలాబ్జపత్రనేత్రములవాఁడు
కమనీయమణిగణ ఘనకిరీటమువాఁడు
రమణీయతర మహాహారంబువాఁడు

సీ. మద్భ్రాత యటుమీఁద మఱి జీవనోపాయ
మెద్దియు లేక దా బుద్దిఁ జూచి
సాహుకారులయొద్ద సతము గుమాస్తయై
తత్కార్యనిర్వాహదక్షుఁడౌట
కని సహింపఁగలేక కరణా లనేకమా
యోపాయముల చేత నాపదన్వి
తుం జేయ యత్నింప దుర్లభం బగుచుండె
భగవదనుగ్రహపటిమఁ జేసి.
అంతఁ గొంతమంది యా గ్రామకరణాల
యత్నమెల్లఁ గని యనర్థమనుచు
తలఁచి నాదుభ్రాత దండ నయ్యాయిపను
లాగిని దీర్చుకొనుచునుండి రనఘ! 3

సీ. జరుగుచుండఁగ నిట్లు నిరుడు శ్రీగిరిరాజు
కులసింధుచంద్రుండు గుండ్లపల్లి
వాసి యోంకారమర్తి వరనియోగి యొకండు
సాహుకారితనంబు జరుపువాఁడు
తనకు నీకరణాలు దండి ఋణం బుండి
ఎన్నాళ్ళనుండియో యీాయకునికి
కడకు వేసటనొంది కంప్లైంటు నొనరించి
డిక్రీని బొందియు సక్రమముగ
అటఁ దదీయమైన యాస్తిలో నొకకొంత
జప్తులోనఁ బెట్ట జానపాట
మామకీన భ్రాత జామీనుపడియెఁదా
జొన్నపైరు గలిగియున్న భువికి. 4

సీ. అటుమీఁదటం గొన్నియహాముల కాపైరు
పండి నష్టంబగుచుండుటయును
కోర్టువారికి వే రిపోర్టిచ్చి వారల
ఆజ్ఞచేఁ గోయించి యాపొలాన

మేడెముల్ వేయించి మెలఁగంగఁ బ్రతివారు
లైన యాగ్రామణు లాముతోడ
ఆ మేడెముల కంకు లవలీలఁ గోయింప
జామీనుదారుఁడౌ మామకీన
భ్రాత యచటి కేగి నీతిగా దిటువంటి
చేఁతయనినఁగూడఁ గోఁత యడిగి
పోవకునికిఁ జేసి పోలీసు కేసాట
చేసెఁ దా రిపోర్టు ప్రేసనునకు. 5

సీ. ఆ రిపోర్టుంజూచి యతిరయంబున వారు
మాయూరి కరుదెంచి యా యకృత్య
ముడిగింపఁ బోయిన నుడుగకయున్నంత
న్యాయమెల్ల విచారణంబు చేసి
సరిగ గుర్జాల మేజస్ట్రేటునకుఁ బంప
పోలీసు కేసాటఁ బూని వారు
పడిగ ముద్దయిలకు వారంట్లు చేయింప
అందఱు నూరలేరని రిపోర్టు
కోర్టు కిప్పించుటంజేసి కోపమొంది
సెలవు లేకయె యెందేగఁగలిగెఁ గరణ
మనుచు నాన్బేలబిలుగ వారండఱికిని
అధిప ! వారంట్లు నిడె శోభనాద్రిగారు. 6

సీ. అప్పు డీకేసు దా నాపత్కరంబగు
నంచెంచి తమ చుట్టమగుచు నెన్నఁ
బడు కాశిరాజు గోపాలకృష్ణయగారి
కడ కేగి మమ్మిప్డు కావవలయు
కరుణమై నని వేడఁ గడుదిట్ట తా నాట
సాక్షులైనట్టి మత్సహజముఖ్యు
లందఱిలో జప్తియాట యీముద్దైల
కెఱుక లేక యొనర్చి రీయకృత్య